క్లుప్తంగా

నగదు అందజేత



మక్తల్: మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి క్రీడా శిబిరాన్ని సందర్శించారు. అక్కడ వివిధ జిల్లాల నుంచి ఖోఖో క్రీడా శిబిరానికి హాజరైన వారితో పరిచయం చేసుకుని అభినందించారు. ఈ నెల 13నుంచి 22 వరకు శిక్షణ నిర్వహించారు. పల్లె ప్రాంతాల్లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంపై ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను అభినందించి, రూ.25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోచ్ రంజిత్, సతీస్, ఖోఖో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, రమేష్‌రావు, రంగప్ప, శిల్ప, రూప, దీప పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఆర్‌ఐ మధుసూదన్‌తో కలిసి ఆయా గ్రామాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించాలి

కృష్ణా: మధ్యాహ్న భోజనం అమలుతోపాటు పాఠశాలల నిర్వహణ ఆయా పాఠశాలలోని హెచ్‌ఎంలు నిరంతరం ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ప్రభుత్వం మధ్యాహ్న భోజనం నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, శివరాజ్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాగనూర్ పాఠశాలలో జరిగిన ఘటనలు పునారవృతం కాకుండా ఉండేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై తమ సంఘం ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తున్నట్లు తెలిపారు.

శబరిమలకు పాదయాత్రగా స్వాములు



మద్దూరు: మండలానికి చెందిన అయ్యప్పస్వాములు మాల ధరించి పాదయాత్రగా శబరిమలకు గురువారం బయలుదేరి వెళ్లారు. నిర్మల్ నుంచి పాదయాత్రగా శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో వెళ్తున్న 40మంది బృందం సభ్యులు వీరు కలిసి బయలుదేరుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 22న అయ్యప్పను దర్శనం చేసుకోనున్నట్లు వారు పేర్కొన్నారు.

తమ కుటుంబాన్ని కాంగ్రెస్ గుర్తించాలి



మరికల్: మండల కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సొంత భూములను దానం చేసిన తమ కుటుంబాన్ని కాంగ్రెస్ గుర్తించాలని స్థల దాతలు జంగడి శశికాంత్, వెంకటేష్, ఆంజనేయులు అన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సొంత స్థలాలను ఇచ్చిన తమ కుటుంబంలో జంగడి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ తరఫున సర్పంచ్‌గా బరిలో దింపాలని వారు కోరారు. అవకాశం ఇస్తే గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, రాఘవేందర్, అరవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులకు సైన్స్‌పట్ల ఆసక్తి కలిగించడానికి, వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి చెకుముకి సైన్స్‌పరీక్ష నిర్వహించనున్నట్లు జ్ఞాన విజ్ఞాన కేంద్రం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. జితేందర్ అన్నారు. మండల స్థాయి పరీక్షను స్థానిక స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో పవన్ కుమార్, భానుప్రసాద్, మండల నాయకులు కవిత, శ్రావణి, మహేశ్వరి, అరుణ పాల్గొన్నారు.



రేషన్‌కార్డులు వచ్చేనా?

- కొన్నాళ్లుగా ఊరిస్తున్న ప్రభుత్వం
- కార్డులు లేక పథకాలకు అర్హత కోల్పోతున్న పేదల



రేషన్ దుకాణంలో బియ్యం వేస్తున్న డీలర్

మరికల్: నూతన రేషన్ కార్డుల జారీపై ఉత్కంఠ నెలకొంది. గడిచిన పదేళ్లుగా నిరుపేదలు ఏ పథకానికి నోచుకోలేదు. ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి దానికి రేషన్ కార్డు కీలకంగా నిలుస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రజాపాలన సభలో పలు పథకాలకు దరఖాస్తులు స్వీకరించగా రేషన్ కార్డు నంబర్ నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష, ఆర్థిక సాయం, రెండు పడకల గదుల ఇళ్లు, కల్యాణలక్ష్మి తదితర పథకాలకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

కొత్త రేషన్‌కోసం..

మండల వ్యాప్తంగా కొత్తరేషన్ కార్డుల కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి 2,870 దరఖాస్తులు వచ్చాయి. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. 2017 నుంచి గత ఏడాది చివరి నాటికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోగా, అవన్నీ వివిధ దశల్లో పెండింగ్‌లోనే ఉన్నాయి.

పరిశీలన ఎప్పుడు..?

రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని దరఖాస్తులు వెల్లువెత్తినా, నాటి ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో విచారణ చేపట్టేందుకు సైతం అధికారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దరఖాస్తులన్నీ ఆర్‌ఐలు, తహసీల్దార్లు, ఏఎస్ఓలు, డీఎస్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

గత ప్రభుత్వం 2021లో కొంతమందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. ఆ తర్వాత దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. ఇక రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్చుటకు సంబంధించి 2023 చివరి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగించింది. ఆ తర్వాత కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అర్హులకు రేషన్ జారీ చేస్తామని ప్రకటించింది. ఇప్పుడిప్పుడే రేషన్‌కార్డుల పంపిణీపై విధివిధానాలను పరిశీలిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రేషన్‌కార్డు నంబర్ కావాలంటున్నారు. కానీ తమతో కార్డు లేదు. ప్రజాపాలనలో కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకున్నాను. కానీ ఇంతవరకు కొత్త కార్డులు జారీ చేయలేదు. ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలి.

- రమేష్, మరికల్

కొత్త కార్డులు ఇవ్వాలి



ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన తమకు ఇంకా కొత్త కార్డులు రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన కొత్తరేషన్ కార్డులు ఇవ్వడం లేదు. దీంతో కొత్తకార్డుల కోసం కళ్లలో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం వెంటనే అర్హులకు రేషన్‌కార్డులను అందజేయాలి.

- రాములు, బూద్యాగానితండా

ప్రభుత్వ ఆదేశాలు రావాలి

ప్రభుత్వం కొత్తరేషన్ కార్డుల మంజూరుకు విధివిధానాలు విడుదల చేసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేస్తాం. ప్రస్తుతం దరఖాస్తులు వివిధ స్థాయిల్లో అధికారులతో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే కొత్త కార్డులలో పేర్లు చేర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- జమీల్, తహసీల్దార్, మరికల్

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

ధన్వాడ: మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని షీటీం పోలీసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. షీటీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులపై ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన టీసేవ్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. అమ్మాయిలు వేధింపులకు గురైతే షీటీం పోలీసుల నంబర్ 8712670398 లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ టీం ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేటలో కేక్ కట్‌చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి



ధన్వాడలో..

నారాయణపేట: పట్టణంలోని ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు ఏ కాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెరువులు కుంటలపై సభ్యత్వంకోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ముదిరాజ్ సభ్యులకు సభ్యత్వాన్ని చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, కొనంగేరి హన్మంతు, డీఎఫ్ఓ రహిమాన్, నాగరాజ్, నర్సింహానాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

ధన్వాడ: మత్స్యకారులకు ఇచ్చిన హామీలను అమలు పరిచి మత్స్యకారులు ఆర్థికంగా బలపడే విధంగా చూడాలని మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక రుణాలు, చేపల వేటకు అవసరమయ్యే పడవలు, వలలు అందజేస్తామని హామీ ఇచ్చారని వాటిని వెంటనే నెరవేర్చాలని కోరారు. నాయకులు నర్సింహులు, డైరెక్టర్లు ఆనంద్, నారాయణ, వెంకటప్ప, పెంటన్న, వెంకటేష్, రామచంద్రయ్య, బాలయ్య, కురుమయ్య, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

పుస్తకాలు చదివి ప్రయోజకులు కావాలి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్

నారాయణపేట టౌన్: విద్యార్థులు గ్రంథాలయాలలోని పుస్తకాలను చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్రం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం కొనసాగింది. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలు చదివేందుకు ఆసక్తి పెంచుకోవాలని, గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన ఎన్నో పుస్తకాలు ఉంటాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ధన్వాడలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు



మరికల్‌లో ప్రతిష్ఠించిన ఎల్లమ్మ విగ్రహం

మరికల్: మండలంలోని మాధవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ దేవత విగ్రహాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అంతకుముందు ఆలయ ఆవరణలో మూడురోజుల పాటు పూజలు చేసిన అనంతరం మూడోరోజు అర్చకులు వేదమంత్రాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని లక్ష్మివాడలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగాయి. గురువారం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠపన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ సరికాదు



నారాయణపేట: జిల్లాలోని మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం తిన్న కొంతమంది విద్యార్థులు అస్వస్థకు గురైన సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మురళీధర్ రెడ్డి, ఉపాధ్యాయుడు బాబు రెడ్డిని సస్పెండ్ చేయడం సరికాని అన్నారు. గురువారం కలెక్టరేట్ ఏఓ బాలరాజుకు ఉపాధ్యాయులు సంఘం నాయకులు బాలాజీ, భీమయ్య విన్నవించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను ఏజెన్సీ వారు సరిగ్గా నిర్వహించకపోవడంతో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారే తప్ప ఉపాధ్యాయుల పొరపాటు కాదని వివరించారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

ఊట్కూరు: మాగనూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కలుషితమై వందమంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ మండల ఇన్‌చార్జి కొక్కు గౌతం గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో పేద విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కలుషిత ఆహారం బారినపడ్డ విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

చక్రధర్‌కు సన్మానం

మక్తల్: జిల్లా నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కర్ని గ్రామానికి చెందిన చక్రధర్ ఎన్నికవడంపై గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చక్రధర్‌ను శాలువాతో సన్మానం చేశారు. కట్టసురేష్, రవికుమార్, కావలి సాయిలు, లక్ష్మన్, నాగేష్, లింగప్ప, బాల్ రాజ్, నూరోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు

ఆత్మకూర్: భగవాన్ శ్రీసత్యసాయిబాబ 99వ జయంతి వేడుకల్లో భాగంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక సత్యసాయి మందిరంలో రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది సత్యసాయి భక్తులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాష, ప్రముఖ న్యాయవాది తిప్పారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారవుతామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి నిర్వాహకులు నవీన్, రఘు, ముక్తేశ్వర్, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, రమేష్, నాగరాజు, నర్సింహులు, వాణి, రెడ్‌క్రాస్ నిర్వాహకులు లక్ష్మీపతి, మహమూద్, రమేష్, లక్ష్మి, అలీ, భక్తులు పాల్గొన్నారు.



పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి



కృష్ణాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

నర్వ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంటలు చేసే ప్రదేశంలో శుభ్రత పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మాగనూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని తీవ్ర అస్వస్థకు గురికావడంపై మండలంలోని ఆయా పాఠశాలలను ఎంఈఓ రామకృష్ణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ శుభ్రమైన వంటపాత్రలతో స్వచ్ఛమైన వంట పదార్థాలను వినియోగించి వంటలు చేయాలన్నారు. వంటలు వడ్డించే ప్రాంతంలో ఎలాంటి ఈగలు, దోమలు వాలకుండా ఆహారపదార్థాలపై కప్పి ఉంచాలన్నారు. నిత్యం తాజా కూరగాయాలను వినియోగించాలన్నారు. వీటిని నిత్యం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పరిశీలన చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీలు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

కృష్ణా: మండలంలోని తంగిడి, గుడెబల్లూర్, కున్సి, కృష్ణా గ్రామాల్లో పాఠశాలలను గురువారం ఎంఈఓ నిజాముద్దీన్‌తో కలిసి ఏఎంఓ, ఎస్‌ఓలు విద్యాసాగర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అలాగే మధ్యాహ్నభోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం రుచితో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల సహకారం



ఊట్కూరులో ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

మరికల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణాలకు దాతలు గురువారం తమవంతు సహకారం అందజేశారు. సరస్వతి ఆలయానికి బీరప్పస్వామి ఆలయ పూజారి సాయప్ప రూ. 2 వేలు, గజ్జలమ్మ దేవత ఆలయ నిర్మాణానికి వీర బసంత్ రూ. 2.16 లక్షలు, రామస్వామి రూ. 51 వేలు, రాజారెడ్డి రూ. 51 వేలు, దండు రాములు రూ. 51 వేలు ఆలయ నిరాహకులకు అందజేశారు. కార్యక్రమంలో దూబాయ్‌రాములు, జగదీష్, కృష్ణయ్య, నారాయణ, శ్రీనివాసులు, కొండన్న, కుర్మన్న, రాజు, శ్రీను, మొగులప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఊట్కూరు: మండలంలోని గోశాల ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి విరాళంగా రూ. 25వేలు అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, రఘు, భాస్కర్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

పుడమిని కాపాడుకుందాం..



విద్యార్థులకు వివరిస్తున్న కొత్తపల్లి రవి

నర్వ: పర్యావరణంలో భాగంగా పుడమి తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ కొత్తపల్లి రవి అన్నారు. గురువారం స్కూల్ ఎర్త్ క్లబ్.. యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా బృందం సభ్యులు సాయిల్ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భావి తరాలకు మనం నిత్యం వినియోగించే మట్టి, గాలి, నీరు, ఎంతో అవసరమైన నేపథ్యంలో భూమాతను కాపాడుకుందామన్నారు. మొక్కల సంరక్షణ, పెంచేవిధానంపై విద్యార్థులకు కృత్యాలతో అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలు, మొక్కలు పెంచుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మి, సంస్థ మెంటర్ చంద్రశేఖర్, సైన్స్ ఉపాధ్యాయులు నవీన్ పాల్గొన్నారు.

సీఎం పేషీకి ఫిర్యాదుతో న్యాయం



చెన్నమ్మకు పట్టాదారు పాస్‌బుక్కును అందజేస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

ఆత్మకూర్: తన భూమి తనకు కాకుండా ఇతరుల కబ్జాలో ఉందని, కబ్జా కోరల నుంచి తమ భూమి ఇప్పించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు ముఖ్యమంత్రి పేషీలో రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించడంతో న్యాయం చేకూరింది. గురువారం తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. మండలంలోని బాలకిష్టాపూర్‌కు చెందిన తెలుగు చెన్నమ్మకు సంబంధించిన వ్యవసాయ భూమి మేడేపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 200లో 21 గుంటల భూమి ఉందన్నారు. రికార్డుల పరంగా భూమి ఉన్న ఇతరుల కబ్జాలో ఉండడంతో ఈఏడాది జులై 30న సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సర్వే నిర్వహించి 19 గుంటల భూమిని చెన్నమ్మ పేరిట రికార్డులో చేర్చి పట్టదార్ పాస్‌బుక్కును గురువారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రసాద్, కార్యాలయసిబ్బంది ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

అమరచింత: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎండీ ఖదీర్ కు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. బుధవారం పట్టణ శివారులో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా తిరుమలాపురం గ్రామానికి చెందిన ఖదీర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వ్యక్తికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

ఐదుగురికి జరిమానా

ఆత్మకూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఇద్దరికి న్యాయమూర్తి జరిమానాలు విధించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. గురువారం వనపర్తి కోర్టులో ఆత్మకూర్‌కు చెందిన శ్రీకాంత్, నందిమల్ల సురేష్, గుంటిపల్లి రాములు కు రూ.1000 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారని, అలాగే బహిరంగంగా మద్యం తాగిన ఆత్మకూర్‌కు చెందిన సద్దాం, శేఖర్ కు రూ.200 చొప్పున ఫైన్లు విధించారని తెలిపారు. తప్పతాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేందర్ హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

ఆత్మకూర్: ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతో పాటు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక ప్రధాన కూడళ్లలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కళాజాత బృందం సభ్యులను అభినందిస్తూ పథకాల తీరును పాటల రూపకంలో ప్రజలకు వివరించడం పై హర్షం వ్యక్తం చేశారు. సభ్యులు శ్రీనివాసులు, కృష్ణయ్య, సువర్ణ, రాజు, నర్సింహ ఉన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



దామరగిద్ద పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న నాయకులు

మద్దూరు: నియోజకవర్గంలోని లగచర్లకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సందర్శనకు వస్తున్నందున ఆ పార్టీ మండల నాయకులు మహ్మద్ అలీ, అశోక్, హన్మంతు, భరత్‌లను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.

మక్తల్: మద్దతు తెలిపేందుకు వెళ్తున్న సీపీఎం నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గోవిందు అన్నారు.ఎవారు మాట్లాడారు.. ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని మార్చుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శివ, కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: లగచర్ల బాధిత రైతులు చేస్తున్న పోరాటాన్ని సంఘీభావం తెలిపేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వచ్చిన సందర్భంగా వామపక్ష పార్టీ నాయకులను ఎక్కడి కక్కడ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీపీఎం మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు.